

ముషీరాబాద్ నియోజకవర్గం బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

కాంగ్రెస్ పాలనలో సంపద సృష్టిస్తే..
బీఆర్ఎస్ విధ్వంసం చేసింది

● డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క

రాంనగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో సంపద సృష్టిస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం విధ్వంసం చేసిందని, హైదరాబాద్ అభివృద్ధికి పునాదులు వేసింది కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనేనని, నగరానికి కృష్ణా, గోదావరి, మంజీరా నీరు తీసుకువచ్చింది తామేనని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క పరిశ్రమ కూడా స్థాపించలేదని విమర్శించారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని వీఎస్టీ ఫంక్షన్‌హాల్‌లో మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన ముషీరాబాద్ నియోజకవర్గం బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో విద్యా, వైద్య రంగాన్ని అభివృద్ధి చేసినట్టు చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్‌లోని ప్రభుత్వ భూముల్ని ఆ పార్టీ నేతలు కబ్జా చేసి లక్షల కోట్ల ప్రజాధనం దోచుకున్నారని ఆరోపించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలవడమే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్‌ను కలిసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు

కూకట్‌పల్లిలోని సమస్యలకు పరిష్కారం చూపండి

● ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

కూకట్‌పల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మూసాపేటలోని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంలో జెడ్సీ అభిలాష అభినవ్‌ను సోమవారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కలిశారు. వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి డివిజన్ల పరిధిలోని సమస్యలను జెడ్సీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సమస్యలకు పరిష్కారం చూపడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మాధవరం రోజాదేవి, జూపల్లి సత్యనారాయణ, నార్నె శ్రీనివాసరావు, దొడ్ల వెంకటేష్‌గౌడ్, రంగారావు పాల్గొన్నారు.

గోకుల్‌ప్లాట్స్ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

మియాపూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ డివిజన్ గోకుల్ ప్లాట్స్ కాలనీలో సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కాలనీ వాసులు సోమవారం ఎమ్మెల్యే గాంధీని కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు సాంబయ్య, సంజీవరెడ్డి, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రతినిధులు

రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై టీహబ్‌లో సమావేశం

రాయదుర్గం,జనవరి29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రపంచ దేశాలతో పోటీపడుతోందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం గచ్చిబౌలిలోని టీహబ్‌లో నార్‌టిక్స్ ఎస్టోనియా, పశ్చిమ యూరప్ దేశాలకు చెందిన 12మంది ప్రతినిధుల బృందంతో కలిసి తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఇతర నగరాలకంటే మౌలిక సదుపాయాలు, మానవ మూలధనం వంటి అంశాల్లో ముందుకు సాగుతోందన్నారు. హైదరాబాద్‌లో వ్యాపారాన్ని సులభతరం చేసేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. గత ఏడాది 20వేల కోట్ల పెట్టుబడులు తెలంగాణ రాష్ట్రానికి వస్తే ఈ ఏడాది ప్రారంభంలోనే 40వేల కోట్ల పెట్టుబడులపై అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. కార్యక్రమంలో జేపీబీ హోల్డింగ్స్, వైట్‌స్టోన్ క్యాపిటల్, మెటప్లానేట్ హోల్డింగ్స్, నార్వే నుండి బిజెల్లా ఇన్వెస్ట్‌మెంట్స్ వంటి, టీహబ్ సీఈవో శ్రీనివాసరావు మహంకాళితో పాటు పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వీడీసీసీ రోడ్డు పనుల పరిశీలన

బాలానగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బాలానగర్‌లో ఎలాంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకు రావాలని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లో వీడీసీసీ రోడ్డు నిర్మాణం పనులను డివిజన్ ఏఈ రషీద్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ సెంట్రల్ ప్రొవిడెంట్ ఫండ్ కమిషనర్ వైశాలి దయాల్

ఈపీఎఫ్ సమస్యలు మా దృష్టికి తీసుకురండి

రాయదుర్గం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు తమ ఎంప్లాయీస్ ప్రొవిడెంట్ ఫండ్(ఈపీఎఫ్)పై సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని అడిషనల్ సెంట్రల్ ప్రొవిడెంట్ ఫండ్ కమిషనర్ వైశాలి దయాల్ తెలిపారు. నానక్‌రాంగూడలోని వర్చుసా కంపెనీలో సోమవారం మాదాపూర్ రీజినల్ ఎంప్లాయిస్ ప్రొవిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ మొదటి వార్షికోత్సవంతో పాటు ఈపిఎఫ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైశాలి దయల్ ముఖ్యఅతిథిగా హాజరై ఉద్యోగులు ఈపిఎఫ్ పై అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉద్యోగులు ఈపీఎఫ్ సమస్యలు పరిష్కరించడానికి త్వరలోనే యూనిక్యూ నెంబర్ కేటాయిస్తామని దీనివల్ల ఉద్యోగులు కంపెనీ మారిన, పేరుమారిన సమస్యలు ఉండవని తెలిపారు. కార్యక్రమంలో పీఎఫ్ రీజినల్ కమిషనర్ వివేక్ రామన్‌రెడ్డి, వర్చుసా సెంటర్‌హెడ్ కృష్ణ, వైస్‌ప్రెసిడెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

దేవునికుంట చెరువు అలుగులో..
నిర్మాణాలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

రాయదుర్గం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గోపన్‌పల్లిలోని దేవునికుంట(మేకచెరువు) సర్వేనెంబర్ 22 అలుగుభాగంలో అడ్డంగా ఓబహుళ అంతస్తుల నిర్మాణ సంస్థ తమ నిర్మాణాలను చేపడుతోందని, ఈ నిర్మాణం అలుగుకు అడ్డంగా ఉందని, అలుగును కాపాడాలని ప్రకృతిమిత్ర స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రవీంద్రప్రసాద్‌దూబే సోమవారం శేరిలింగంపల్లి తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. భారీ వర్షాలు కురిసినప్పుడు చెరువు నుంచి దిగువకు పారే కాల్వను సైతం ధ్వంసం చేసి అడ్డంగా నిర్మాణాలు చేపడుతుండటంతో చెరువు ఉనికి ప్రమాదంలో పడుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు చెరువు కాల్వలను ధ్వంసం చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చట్టపరంగా చర్యలు తీసుకుని చెరువును కాపాడాలని కోరారు.

పనిచేయని నిఘానేత్రాలు..

పట్టించుకోని అధికారులు..

తరచూ దొంగతనాలు



చందానగర్ పీజేఆర్‌స్టేడియం, అలంకార ప్రాయంగా మారిన సీసీకెమెరాలు

చందానగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నేరాల అదుపునకు నిఘానేత్రాలు ఎంతో అవసరమని.. పాలకులు, అధికారులు ప్రతిష్ఠాత్మకంగా నిఘా నేత్రాలను లక్షలు వెచ్చించి ఏర్పాటు చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. దీంతో తరుచు దొంగతనాలు జరుగుతున్నా నిమ్మకు నీరెత్తినట్లుగా సంబంధిత అధికారులు వ్యవహరిస్తున్నారు. ఇదేక్కడో కాదు.. హైటెక్‌సిటీ కూతవేటు దూరంలో చందానగర్ పీజేఆర్ స్టేడియంలో జరుగుతున్న తంతుపై ఆంధ్రజ్యోతి కథనం. అన్నీ ఉన్నా అల్లుడి నోటిలో శని అనే చందంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ డివిజన్ చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియం మారింది. స్టేడియంలో 8 సంవత్సరాల క్రితం రూ.50 లక్షల వ్యయంతో సీసీ కెమెరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రెండు సంవత్సరాలు అవి పనిచేశాయి. ఆ తర్వాత నుంచి సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో తరుచు దొంగతనాలు కొనసాగుతూనే ఉన్నాయి. స్టేడియంలో ప్రధాన కార్యాలయంతో పాటు వివిధ క్రీడా మైదానాల్లో, వాకర్స్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రెండు మూడు సంవత్సరాల నుంచి సుమారుగా పది నుంచి 15 సైకిళ్లు దొంగలు అపహరించుకుపోయారు. పోలీసులకు, జీహెచ్ఎంసీ సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా కెమెరాలకు మరమ్మతులు తూతూమంత్రంగా చేస్తున్నారు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో పలు మార్లు దొంగతనాలు జరిగినప్పుడు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నేర నియంత్రణ కోసం ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు.. ఉన్న కెమెరాలకు మరమ్మతులు చేయాలని స్థానికులు, క్రీడాకారులు, వాకర్స్ విజ్ఞప్తి చేస్తున్నారు.

ఓయూలో లైట్స్ అండ్ సౌండ్ లేజర్ షో

● ప్రారంభించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తదితరులు

తార్నాక, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మకమైన ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ భవనానికి రూ.11.8 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన లైట్స్ అండ్ సౌండ్ లేజర్ షో కార్యక్రమాన్ని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. లేజర్ వెలుగుల ప్రొజెక్షన్ ద్వారా వర్సిటీ చరిత్రను, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఓయూ పాత్రను, భారత స్వాతంత్ర్య సంగ్రామాన్ని సజీవంగా వివరించే విధంగా రూపొందించారు. కాగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో 16 మిలియన్లకు పైగా రంగుల కలయికతో డీఎంఎక్స్ ప్రొటోకాల్‌ని ఉపయోగించి 600 కంటే ఎక్కువ లైట్లను పొందుపరిచారు. ఈ సందర్భంగామంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థానిక సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి తెలియజేయాలనే ఉద్దేశంతో ఇటువంటి ప్రాజెక్టులను చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగానే తెలంగాణ ఉద్యమానికి కేంద్ర బిందువైన ఓయూ ఆర్ట్స్ కాలేజీ బిల్డింగ్‌కు అధునాతనమైన టెక్నాలజీతో లైట్ అండ్ సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేశామన్నారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీకి ఏర్పాటు చేసిన లైట్ అండ్ సౌండ్ సిస్టమ్ ప్రారంభోత్సవం సాంస్కృతిక గొప్పతనాన్ని, కళాత్మకతకు ప్రతీకగా నిలిచిందని అభిప్రాయపడ్డారు. దేశానికి ఎంతోమంది మేధావులు, ప్రముఖులను సమాజానికి అందించిన గొప్ప చరిత్ర ఉస్మానియా యూనివర్సిటీకి ఉందని, ఇంతటి గొప్ప చరిత్ర ఉన్న ఓయూ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఓయూ వీసీ డా.రవీందర్ మాట్లాడుతూ.. ఉస్మానియా యూనివర్సిటీలో సాంస్కృతిక మౌలిక సదుపాయాలను కల్పించడానికి సహకరించిన కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్ట్స్ కాలేజీకి ఏర్పాటు చేసిన లేజర్ వెలుగులు ఓయూకు కొత్త కళను తీసుకొచ్చాయని అభిప్రాయపడ్డారు. మాజీ వీసీ ప్రొఫెసర్ డీసీ రెడ్డి, తిరుపతి రావు, సినీనటుడు సాయికుమార్, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి, ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ, ఓఎస్డీ రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ ప్రజలకు రుణపడి ఉంటా..

● ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

గాజులరామారం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నన్ను మూడోసారి అసెంబ్లీకి పంపిన కుత్బుల్లాపూర్ ప్రజలకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే కే.పీ.వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్‌లోని బతుకమ్మ బండలోని 16వ రోజు కృతజ్ఞతా యాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గెలిపించినందుకు కృతజ్ఞతా యాత్ర నిర్వహిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరి, నాయకులు బాల్‌రాజ్, కమలాకర్, చెట్ల వెంకటేష్, మల్లేష్, శివప్ప, మంజుల, యాదగిరి, మూసాఖాన్, ఇబ్రహీం, పరమేశ్వర్ పంతులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీలు మెరుగైన వైద్యమందించాలి

షాపూర్‌నగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సూరారం డివిజన్‌లోని పీపుల్స్ ఆసుపత్రిలో సోమవారం తెలంగాణ కమ్యూనిటీ పారా మెడిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో వార్షికోత్సవ సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కే.పీ.వివేకానంద్, స్థానిక కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్ఎంపి డాక్టర్‌లు పేద మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఆర్ఎంపి డాక్టర్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఆర్ఎంపి డాక్టర్స్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత సురేష్‌రెడ్డి, ఆర్ఎంపి డాక్టర్స్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలి

● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కూకట్‌పల్లిలో ప్రాథమిక పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్

కూకట్‌పల్లి, జనవరి29 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు కోరారు. కూకట్‌పల్లి గ్రామంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ సహకారంతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. మాజీ సీఎం కేసీఆర్ ఆలోచనా విధానంతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించే అవకాశం కలిగిందన్నారు. దాతల సహకారంతో నిర్మించిన భవనాలకు ప్రొటోకాల్‌ను పాటించాలని, దాతల పేర్ల వివరాలను శిలాఫలకాల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కొండల్‌రావు, డీఈవో విజయకుమారి, ఎంఈవో ఆంజనేయులు, కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, నర్సింహయాదవ్, సతీష్‌గౌడ్, సబీహాబేగం, రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

3న కార్యకర్తల సమావేశం..

రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గ కార్యకర్తల సమావేశం ఫిబ్రవరి 3న నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. కూకట్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన నియోజకవర్గ ముఖ్యనాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులతో సమావేశమయ్యారు. కూకట్‌పల్లిలోని ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించనున్న కార్యకర్తల సమావేశానికి పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ హాజరవుతారని వివరించారు. కార్యకర్తలు భారీగా రావాలని కోరారు.

ప్రజావాణికి 38 ఫిర్యాదులు



కుత్బుల్లాపూర్ ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు అందుకుంటున్న డీసీ మల్లయ్య, అధికారులు

కూకట్‌పల్లి, జనవరి29 (ఆంధ్రజ్యోతి): మూసాపేటలోని జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి కూకట్‌పల్లి జోనల్ కార్యాలయ పరిధిలోని ఐదు సర్కిళ్ల నుంచి 38 ఫిర్యాదులు అందాయి. మూసాపేట సర్కిల్ నుంచి 5, కూకట్‌పల్లి నుంచి 1, కుత్బుల్లాపూర్ 3, గాజులరామారం 12, అల్వాల్ 4, జోనల్ కార్యాలయానికి సంబంధించినవి 13 చొప్పున ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో జోనల్, మూసాపేట, కూకట్‌పల్లి సర్కిళ్లకు చెందిన అన్నీ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల కార్యాలయాల్లో వేర్వేరుగా ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ మేరకు కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో 3 ఫిర్యాదులు, గాజులరామారం సర్కిల్‌లో 12 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమాల్లో జంటసర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు నర్సింహా, ఎల్‌పీ.మల్లయ్య, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అభయహస్తం దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయని డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్, పారిశుధ్యం, రెవెన్యూ విభాగం అధికారులు పాల్గొన్నారు.

చింతల్ జలమండలి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి పద్మానగర్ ఫేజ్-2 (ఎక్స్‌టెన్షన్)లో 20 ఏళ్ల క్రితం వేసిన భూగర్భ డ్రైనేజీలో కేవలం 6 అంగుళాల పైపులైన్ వ్యవస్థ ఉందని దాని వల్ల నిత్యం మురుగునీటి సమస్యను ఎదుర్కోవలసి వస్తుందని, వాటి స్థానంలో నూతనంగా 12 అంగుళాల పైపులను అమర్చాలని జలమండలి జీఎం శ్రీధర్‌రెడ్డికి కాలనీ అధ్యక్షుడు నటరాజ్‌గౌడ్, కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు.

బాలానగర్‌లో కాంగ్రెస్ నేతల పాదయాత్ర

బాలానగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలు తెలుసుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండిరమేష్ సూచనల మేరకు సోమవారం పార్టీ నాయకులు బాలానగర్‌లోని బస్తీలలో పాదయాత్ర చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, ఉపాధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ కార్యదర్శి పుష్పారెడ్డి మాట్లాడుతూ.. వేల కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేసి బాలానగర్ డివిజన్‌ను అభివృద్ధి చేశామని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారని, అదంతా సొంత డబ్బా తప్పితే వాస్తవం లేదని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మధుగౌడ్, మాజీ కౌన్సిలర్ లక్ష్మయ్య, సంజీవ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రతినిధిగా నియమితుడైన మల్లు రవిని కూకట్‌పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సంజీవరావు, అరవింద్‌రెడ్డి, చున్నాపాష తదితర నాయకులు పాల్గొన్నారు.

బాలానగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి)

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

గచ్చిబౌలి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య అన్నారు. సోమవారం నల్లగండ్ల హుడాకాలనీలోని విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మియాపూర్ ట్రాఫిక్ సీఐ పవన్‌కుమార్, పాఠశాల అధ్యాపకబృందం పాల్గొన్నారు.

మృతదేహం ఆచూకీ లభ్యం

గాజులరామారం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సూరారం దుర్గాభవాని ఆలయం సమీపంలోని చెట్లపొదల్లో ఈనెల 14న లభ్యమైన గుర్తుతెలియని మృతదేహం వివరాలను పోలీసులు తెలుసుకున్నారు. సూరారం రాజ్యలక్ష్మీనగర్‌కు చెందిన బేబి(40) భర్త అంజయ్య, కుటుంబ సభ్యులతో కలసి నివాసం ఉంటుంది. మద్యానికి బానిసైన భర్తతో బేబి తరచూ గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లి వారినికి, నెలకు ఒకసారి ఇంటికి వచ్చేది. ఆ క్రమంలో సంక్రాంతి పండుగ 10 రోజుల ముందు ఇంటి నుంచి బయటకు వెళ్లింది. కుటుంబ సభ్యులు ఎప్పటిలాగే బేబి ఇంటికి వస్తుందని ఎదురుచూశారు. కానీ, ఎంతకీ ఇంటికి రాకపోవడంతో సూరారం పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన కుటుంబసభ్యులకు మృతురాలు వద్ద దొరికిన ఆధారాలను పోలీసులు వారికి చూపించారు. అవి చూసిన కుటుంబసభ్యులు బేబి అని గుర్తించారు. బేబి ఏ విధంగా మృతి చెందిందో పోస్టుమార్టం రిపోర్టు వస్తేనే తెలుస్తుందని సీఐ వెంకటేశ్వరావు తెలిపారు.

అద్దాలకు బ్లాక్‌ఫిలిం ఉన్న కార్లపై కేసు నమోదు

రాయదుర్గం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీసులు సోమవారం కారు అద్దాలకు బ్లాక్ ఫిలిం వేసివున్న కార్ల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా కారు అద్దాలకు బ్లాక్ ఫిలిం ఉన్న 20 కార్లను గుర్తించి వాటికున్న బ్లాక్ ఫిలింను తొలగించి కార్ల యజమానులపై కేసు నమోదు చేసినట్లు మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ రణధీర్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా వట్టినాగులపల్లిలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ రణధీర్‌రెడి ట్రాఫిక్‌సీఐ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

రాయదుర్గం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ శిల్పారామంలో హ్యాండ్లూమ్ ఎక్స్‌పో గాంధీ బుణకర్ మేళ సందర్భంగా వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత హస్తకళా ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. సాయంత్రం హంపీథియేటర్‌లో నాట్య ప్రేరణ స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ గురువర్యులు శరత్ షియాహాబ్ బృందం కూచిపూడి ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

షాపూర్‌నగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ మతతత్వ విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న దేశవ్యాప్త కార్మికుల గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. సోమవారం షాపూర్‌నగర్‌లోని సిఐటియూ కార్యాలయంలో సిఐటియూ, ఏఐటీయూసి, ఐఎఫ్‌టియూ సంఘాల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి లక్ష్మణ్‌తో పాటు సిఐటియూ జిల్లా అధ్యక్షులు జి. అశోక్, ఏఐటియూసి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థ మరుగుదొడ్లను తొలగించాలి



శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు

పేట్‌బషీరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): లక్షలు వెచ్చించి నిర్మించిన స్వచ్ఛ్ మరుగుదొడ్లు నేడు శిథిలావస్థలో ఉన్నాయి. రంగారెడ్డి నగర్ డివిజన్‌లోని గిరినగర్ ప్రధాన రహదారిపై ఏర్పాటుచేసిన మరుగుదొడ్లు ప్రారంభించిన కొన్ని రోజులకే మూతపడింది. అప్పటి నుంచి నేటి వరకు అధికారులు పట్టించుకోపోవడంతో మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయి. ఈ రహదారిపై రాకపోకలు సాగించే వారికి ఇబ్బంది కరంగా మారిందని, వాటిని తొలగించాలని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వారు ఇప్పటికైన అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన మరుగు దొడ్లను తొలగించాలని కోరుతున్నారు.

బఫర్‌జోన్ నిర్మాణదారులకు నోటీసులు

పేట్‌బషీరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్‌లోని వెన్నెలగడ్డలో నివాసం ఉంటున్న 47మందికి జీహెచ్ఎంసీ అధికారులు నోటీసులు అందజేశారు. ఎన్నాచెరువు ఎఫ్‌టీఎల్ బఫర్‌జోన్‌లో నిర్మాణాలు చేపట్టిన వారు ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు, సంబంధిత పత్రాలు ఏడు రోజుల్లో కుత్బుల్లాపూర్ జీహెచ్ఎంసీలో చూపించాలని నోటీసులో పేర్కొన్నారు. సోమవారం బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి భరత్ సింహారెడ్డికి తమ గోడును వెళ్ళబోసుకొన్నారు. అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తానని బాధితులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ కిసాన్ మోర్చా అధ్యక్షులు కె. సంజీవ్‌రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై డిప్యూటీ కమిషనర్‌కు వినతి



రోడ్డును అక్రమించి నిర్మిస్తున్న నిర్మాణం

హైదర్‌నగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్ కాలనీ డివిజన్ మహంకాళీనగర్‌లో రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని మహంకాళి వెల్ఫేర్ అసోసియేషన్ సొసైటీ వాసులు సోమవారం డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. అక్రమ నిర్మాణం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

తాండ్రకుమార్ వర్ధంతిని జయప్రదం చేయాలి

మియాపూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎంసీపీఐ(యు) నాయకుడు తాండ్రకుమార్ ద్వితీయ వర్ధంతి ఫిబ్రవరి 14న నిర్వహిస్తున్నామని, పార్టీ నాయకులు కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేయియాలని పార్టీ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి రమేష్ కోరారు. ఈ మేరకు సోమవారం మియాపూర్ స్టాలిన్‌నగర్‌లో ఎంసీపీఐ(యు) డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చందర్, భాగ్యమ్మ, దశరత్‌నాయక్, లావణ్య, శివాని, లలిత, నర్సింహ, అరుణ, గౌసియాబేగం, ఇషాక్, నాగభూషణం, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.